ప్రజాశక్తి
సోమవారం 9 జనవరి 2023
5
శ్రీకాకుళం

దళితుల భూములు ఆక్రమించడం తగదు

వ్య.కా.స జిల్లా ప్రధాన కార్యదర్శి సింహాచలం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నగరంలోని పెద్దపాడు పోలీస్‌స్టేషన్‌కు ఆనుకుని సర్వే నంబరు 68/2 సి, డిలో దళితులకు ప్రభుత్వం ఇచ్చిన ల్యాండ్ సీలింగ్ భూమిని పెత్తందారులు ప్రలోభాలకు గురిచేసి ఆక్రమించుకున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం అన్నారు. ఈ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తూ అక్రమ నిర్మాణాలకు అండగా నిలుస్తున్నారని విమర్శించారు. నిర్మాణాలు చేపడుతున్న ప్రదేశాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. తంగివానిపేటకు చెందిన దళితుడు లోపింటి రామయ్యకు ఇచ్చిన ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాలు చేపడుతుంటే, ప్రభుత్వ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు జోక్యం చేసుకుని దళితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ భూములపై న్యాయస్థానాలకు తప్పుడు పత్రాలు చూపించి ప్రభుత్వాన్ని, దళితులను మోసం చేస్తున్న పెత్తందారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ భూములపై రెవెన్యూ అధికారులు సమగ్ర దర్యాప్తు చేపట్టాలన్నారు. దళితులకు న్యాయం చేయాలని, లేకుంటే వారి తరుపున పోరాటం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

స్థలాన్ని పరిశీలిస్తున్న గంగరాపు సింహాచలం

రేషన్ అరకొరే

- నేటికీ పూర్తిస్థాయిలో రాని కందిపప్పు
- కొన్నిచోట్లే పంచదార పంపిణీ
- లబ్ధిదారుల్లో నిరాశ
- జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 42 శాతం పంపిణీ

పండగ నెలలో రేషన్ సరుకులన్నీ అరకొరగానే అందుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పథకం బియ్యం ఇస్తుండడంతో రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ బియ్యాన్ని ఆపేసింది. పోనీ ఇతర సరుకులైనా అందుతాయనుకుంటే అవీ సరిగా పంపిణీ కావడం లేదు. కందిపప్పు పూర్తిస్థాయిలో జిల్లాకు రాకపోవడంతో ఉన్న మేరకు కార్డుదారులకు పంపిణీ చేస్తున్నారు. కార్డుదారులకు ఇచ్చేందుకు పంచదార సరిపోతుందని అధికారులు చెప్తున్నా, జిల్లాలో కొన్నిచోట్ల మాత్రమే పంచదార ఇస్తున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో మొత్తం 6,52,397 రేషన్‌కార్డులు ఉన్నాయి. వీటిలో ప్రాధాన్యత కుటుంబాలు (పిహెచ్‌హెచ్) కేటగిరీలో 6,14,673 కార్డులు, అన్నా అంత్యోదయ యోజన (ఎఎవై) కేటగిరీలో 37,724 కార్డులు ఉన్నాయి. డిసెంబరులో వీరికే బియ్యం, కందిపప్పు, పంచదార పంపిణీ చేశారు. ఈ కీ రిజిస్టర్ ఆధారంగానే ఈ నెలలోనూ సరుకులను పంపిణీ చేయాల్సి ఉంది. ఇప్పటివరకు 2,76,291 కార్డుదారులకు రేషన్ పంపిణీ చేశారు. వీరిలో 2,60,051 పిహెచ్‌హెచ్ కార్డుదారులు, 16,240 ఎఎవై కార్డుదారులు ఉన్నారు. ఇప్పటివరకు 4,488 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేశారు. కందిపప్పు 144 మెట్రిక్ టన్నులు, పంచదార 218 టన్నుల వరకు అందించారు. గత నెలతో పోలిస్తే ఇప్పటివరకు 42.35 శాతం మందికే రేషన్ అందింది.

నేటికీ రాని కందిపప్పు

జిల్లాలో 6,58,257 రేషన్ కార్డుదారులకు సరఫరా చేసేందుకు 652 మెట్రిక్ టన్నుల కందిపప్పు అవసరం. ఇప్పటివరకు 283 టన్నులు మాత్రమే అందుబాటులో ఉంది. మరో 50 టన్నులు ఒకట్రెండు రోజుల్లో జిల్లాకు చేరనుంది. ఇంకా 319 టన్నులు కావాల్సి ఉండడంతో, ఆ మేరకు తమకు కందిపప్పు పంపాలని జిల్లా అధికారులు పౌర సరఫరాల కమిషనర్‌కు లేఖ రాశారు. ఇప్పటికీ పూర్తిస్థాయిలో కందిపప్పు రాలేదు. పంచదార నిల్వల పరిస్థితి అలాగే ఉంది. జిల్లాకు 380 టన్నుల పంచదార అవసరం కాగా, 202 టన్నులు మాత్రమే అందుబాటులో ఉంది.

డిడిలు తీసిన డీలర్లు సగం మందే

రేషన్ దుకాణాలకు కందిపప్పు, పంచదార సరఫరాకు డీలర్లు ప్రతి నెలా డిడిలు తీస్తారు. సరుకుల లభ్యత, వినియోగం ఆధారంగా డీలర్లు సొమ్ములు చెల్లిస్తారు. ఈసారి సరుకుల లభ్యత తక్కువగా ఉందన్న సమాచారంతో డిడిలు తీయడానికి డీలర్లు ఆసక్తి కనబరడచడం లేదు. అప్పు చేసి డిడిలు తీసిన సొమ్ము ప్రభుత్వం దగ్గర ఉండిపోతే తాము వడ్డీలు చెల్లించాల్సి వస్తుందనే ఆలోచనతో ముందుకు రాలేదు. తహశీల్దార్లు, డిటిలు తీవ్ర ఒత్తిడి చేయడంతో తప్పనిసరి పరిస్థితుల్లో డిడిలు తీశారు. పంచదారకు పూర్తిస్థాయిలో డిడిలు తీయగా, కందిపప్పుకు మాత్రం సగం మందే డిడిలు తీశారు.

ఉచిత బియ్యంతోనే సరిపెడుతున్న ప్రభుత్వం

రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం ప్రస్తుతం ఉచిత బియ్యమే అందిస్తోంది. ప్రతి నెల ఎండియు (మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్లు) ద్వారా పేదలకు పంపిణీ చేయాల్సిన సబ్సిడీ బియ్యం (కేజీ రూ.1) దక్కే అవకాశాలు లేవని తెలుస్తోంది. ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన (పిఎంజికెఎవై) కింద మరో ఏడాది పాటు ఉచితంగా బియ్యాన్ని అందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. గతంలో మాదిరిగానే జాతీయ ఆహార భద్రతా చట్టం (ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎ) కింద ఉన్న కార్డుదారులకు అందించే బియ్యానికే కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోంది. ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎ కార్డుదారులకు అందించే బియ్యం సబ్సిడీని అటు రాష్ట్ర ప్రభుత్వం భరించేందుకు సిద్ధంగా లేదు. సబ్సిడీ బియ్యంతో దీన్ని సర్దుబాటు చేయాలని నిర్ణయించింది. ఎండియు వాహనాల ద్వారా ఒకటో తేదీ నుంచి పంపిణీ చేస్తున్న రేషన్‌లో ఎన్‌ఎఫ్‌ఎస్ లబ్ధిదారులకు ఉచితంగా పంపిణీ చేస్తూ, నాన్ ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎ లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేయకుండా ఉచితంగా బియ్యం అందిస్తోంది. జిల్లాలో ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎ, నాన్ ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎ కార్డులు మొత్తం 6,61,818 కార్డులు ఉన్నాయి. అందులో 6,22,838 కార్డులు ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎ కేటగిరీలో, 38,980 కార్డులు నాన్ ఎఫ్‌ఎస్‌ఎ కేటగిరిలో ఉన్నాయి.

పరీక్షలను పరిశీలిస్తున్న ఎపిపిఎస్‌సి ప్రత్యేక కార్యదర్శి అరుణ్ కుమార్

ప్రశాంతంగా గ్రూప్-1 పరీక్షలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్-1 స్క్రీనింగ్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. కోవిడ్ నిబంధనలకు అనుగుణంగా జిల్లాలోని 19 పరీక్షా కేంద్రాల్లో మాస్‌కాపీయింగ్‌కు తావులేకుండా పకడ్బందీగా పరీక్షలను నిర్వహించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 5,600 మంది దరఖాస్తు చేసుకోగా, ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించిన మొదటి పేపరు పరీక్షకు 4,065 (72.59 శాతం) మంది హాజరయ్యారు. 1535 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2 నుంచి నాలుగు గంటల వరకు నిర్వహించిన రెండో పేపరు పరీక్షకు 4,050 (72.32 శాతం) మంది హాజరు కాగా, 1550 మంది గైర్హాజరయ్యారు. శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రాన్ని ఎపిపిఎస్‌సి ప్రత్యేక కార్యదర్శి హెచ్.అరుణ్ కుమార్ పరిశీలించారు. ఎచ్చెర్ల మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, అరసవల్లి రోడ్డులోని కేశవరెడ్డి స్కూల్ పరీక్షా కేంద్రాలను డిఆర్ఒ ఎం.రాజేశ్వరితో కలిసి కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ పరిశీలించారు.

నారాయణపురం కాలువపై
వారధికి శంకుస్థాపన

ప్రజాశక్తి - ఆమదాలవలస

మండలంలోని తొగరాంలో నారాయణపురం కాలువపై రూ.83.10 లక్షల వ్యయంతో వారధి నిర్మాణానికి సర్పంచ్ తమ్మినేని వాణితో కలిసి శాసనసభ స్పీకర్ సీతారాం ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా నీరు ప్రవహించే కాలువ దాటి పొలాలకు వెళ్లాలంటే రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. వారికి ప్రయోజనం కలిగేలా అదే చోట వారధి నిర్మాణానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వెనువెంటనే ఆర్థికశాఖ ఆమోదం తెలపడం, పాలనాపరమైన అనుమతులు మంజూయ్యాయని చెప్పారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, స్వగ్రామానికి ఏమిచ్చినా రుణం తీర్చుకోలేమన్నారు. తన రాజకీయ జీవితం ప్రారంభం నాటి నుంచి గ్రామాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేశానన్నారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉండగా... వీటికి తోడుగా వ్యవసాయ పాలిటెక్నిక్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసేలా కృషి చేశానన్నారు. దీంతో ఒకేచోట ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారికి ఉచిత విద్య లభించినట్లు అయిందన్నారు. శ్రీకాకుళం, ఆమదాలవలస ప్రధాన రహదారి నుంచి తొగరాంకు డబుల్ రోడ్డు నిర్మాణం గావించి, పూర్తిస్థాయి కనెక్టివిటీకి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తొగరాం నుంచి నిమ్మతొర్లాడ మీదుగా కొల్లివలసకు అనుసంధానిస్తూ ప్రధాన రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదించినట్లు చెప్పారు. ఇవి పూర్తయితే గ్రామానికి పలు ప్రధాన పట్టణాలతో పాటు జిల్లా కేంద్రానికి అతి తక్కువ సమయంలో రవాణా సౌకర్యం ఏర్పడే అవకాశాలు ఉన్నాయన్నారు.ఆమదాలవలస, సంతకవిటి మండలాలను కలిపే బలసలరేవు వంతెన నిర్మాణ సాధనలో కృషి చేశానన్నారు. దీని నిర్మాణం వలన సమీప మండలాలు, గ్రామాలతో తొగరాంకు రోడ్డు కనెక్టివిటీ పెరిగి అభివృద్ధికి కేంద్ర బిందువుగా నిలవనుందని చెప్పారు. కార్యక్రమంలో వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, వైస్ ఎంపిపి మానుకొండ వెంకటరమణ, పిఎసిఎస్ అధ్యక్షులు జి.శ్రీనివాసరావు, డిసిఎంఎస్ డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, పొన్నాడ రాము తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ సీతారాం

ఆదర్శప్రాయుడు ఎన్‌టిఆర్

- శతజయంతి ఉత్సవాలను ప్రారంభించిన గుండ లక్ష్మీదేవి
- అలరించిన ఎన్‌టిఆర్ ఏకపాత్రాభినయం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సినీ నటుడిగా, ముఖ్యమంత్రిగా ప్రజల మనస్సుల్లో సుస్థిర స్థానం సంపాధించుకున్న కీర్తిశేషులు నందమూరి తారకరామారావు ఆదర్శ ప్రాయుడని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో ఆదివారం టిడిపి సాంస్కృతిక విభాగం ఆధ్వర్యాన నిర్వహించిన ఎన్‌టిఆర్ శతజయంతి వేడుకలను ఆమె జ్యోతిప్రజ్వళన చేసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సినీ నటుడిగా తెలుగువారి మనసులో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. రాష్ట్రంలో అట్టడుగున ఉన్న పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా టిడిపిని స్థాపించి తొమ్మిది నెలల్లోనే అధికారాన్ని చేపట్టి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీలకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. ఆయన తర్వాత టిడిపి బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు సుదీర్ఘ కాలం పాటు 14ఏళ్లు ముఖ్యమంత్రిగా పని చేసి ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు మాటాడుతూ ఎవరేమన్నా మళ్లీ మన తెలుగు జాతి, తెలుగుదేశం వైభవం మరలా 2024లో రాబోతోందని, ఎన్‌టిఆర్ నటనలో ఆయనకు మించిన వారెవరూ లేరన్నారు. మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావు మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగు తేజం, తెలుగు భాష సాంస్కృతిక వైభవం పునరావృతం అవుతుందని అన్నారు. తెలంగాణా తెలుగు మహిళా అధ్యక్షులు జోత్న్స, టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్, మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ తదితరులు మాట్లాడారు. ఎన్‌టిఆర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సాంస్కృతిక విభాగం జిల్లా కార్యదర్శి గుత్తు చిన్నారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మీడియా కన్వీనర్ జామి భీమశంకరరావు స్వాగతోపన్యాసం చేశారు. కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి చింతు సుధాకర్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పిఎంజె బాబు, చిట్టి మోహన్, అధికార ప్రతినిధి ముద్దాడ కృష్ణమూర్తినాయుడు, చిట్టి నాగభూషణం, కవ్వాడి సుశీల, సీపాన రమ, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ఏకపాత్రాభినయం

ఎన్‌టిఆర్ నటించిన సినిమాల్లోని పాత్రలతో 15 మంది కళాకారుల ఏకపాత్రాభినయం అలరించింది. దుర్యోధనుడు, రావణుడు, సత్యహరిశ్చంద్రుడు, శ్రీకృష్ణ దేవరాయులు, అల్లూరి సీతారామరాజు, తదితర పాత్రల్లో జీవించారు. అనంతరం ఎన్‌టిఆర్ నటించిన సినిమా పాటలతో సంగీత విభావరి ఆకట్టుకుంది. ప్రేక్షకులను మంత్రముగ్దులను చేసింది.

కళాకారులకు బహుమతులు అందిస్తున్న టిడిపి నాయకులు

సంగీత విభావరిలో పాటలు పాడుతున్న సింగర్స్

ఉపాధి కూలీలకు సు'రక్ష'

- జిల్లాలో 2 లక్షల జాబ్ కార్డుదారులు అర్హులు
- ఏడాదికి రూ.20 ప్రీమియం చెల్లిస్తే చాలు
- ప్రభుత్వ కట్టడాలపై ప్రత్యేక శ్రద్ధ
- డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జాతీయ మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి చట్టంలో పని చేస్తున్న ప్రతి కూలీకి బీమా సౌకర్యం కల్పించాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చడానికి చర్యలు తీసుకుంటున్నట్లు నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి.వి.చిట్టిరాజు తెలిపారు. అందులో భాగంగా జిల్లాలో అర్హులైన 2లక్షల మంది కూలీలకు పిఎం సురక్ష యోజన బీమా పథకాన్ని వర్తింపజేయనున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ కూలీలను ఈ పథకంలో చేర్పించేందుకు సిబ్బందికి లక్ష్యం విధించినట్లు చెప్పారు. ఉపాధి హామీ చట్టం ద్వారా చేస్తున్న పనులు, జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు వినియోగం, జాబ్‌కార్డులకు ఆధార్ అనుసంధానం, తదితర అంశాలను ప్రజాశక్తి ముఖాముఖిలో ఆయన వివరించారు.



డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు

సురక్ష యోజన పథకం ఎవరికి వర్తింపజేస్తున్నారు?

జిల్లా వ్యాప్తంగా ఉన్న సుమారు 6.50 లక్షల మంది కూలీల్లో 18 నుండి 50 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారు ఈ పథకానికి అర్హులు, వారు తమ కూలి నుంచి ఏడాదికి రూ.20 ప్రీమియంగా చెల్లిస్తే చాలు వారికి బీమా వర్తిస్తుంది. ఈ బీమా ప్రీమియం చెల్లించిన వారికి ఏదైనా అనుకోని సంఘటన జరిగి ప్రమాదవశాత్తు మరణిస్తే ఆ కుటుంబానికి రూ.2 లక్షలు బీమాను కంపెనీలు చెల్లిసాయి. ప్రమాదంలో అంగవైకల్యం సంభవిస్తే రూ.లక్ష చెల్లిస్తారు. గ్రామస్థాయిలో వెలుగు ప్లాస్టర్ ఫెసిలిటేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు సమన్వయంతో ఈ పథకంలో కూలీలను భాగస్వాములను చేసే బాధ్యతలను అప్పగించాం. శతశాతం కూలీలు ఈ పథకంలో చేరేలా సిబ్బందికి లక్ష్యాన్ని నిర్దేశించాం. ఈ నెలాఖరులోగా అనుకున్న లక్ష్యాన్ని సాధించడం ద్వారా కూలీలకు భరోసా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

ఈ ఏడాది ఉపాధి హామీ పనుల్లో మెటీరియల్, కాంపోనినెంట్ పనుల లక్ష్యం ఎంత?

జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు శాశ్వత ప్రాతిపదికన నిర్మించడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా గ్రామ సచివాయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లీనిక్‌లు, బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్లు, ఏరియా బల్క్‌మిల్క్ యూనిట్లు నిర్మించడానికి ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో ప్రధానంగా రైతుల అవసరాలకు అనుగుణంగా రైతు భరోసా కేంద్రాలను మంజూరు చేశారు. మొదటి విడతలో జిల్లా వ్యాప్తంగా 834 రైతు భరోసా కేంద్రాలకు సొంత భవనాలను సమకూర్చడానికి రూ.183.25 కోట్లు ఖర్చు చేశాం. రెండో విడత బల్క్‌కూలింగ్ యూనిట్ల మంజూరుకు కలెక్టరు అనుమతించారు. గ్రామ సచివాలయాలు, హెల్త్ క్లీనిక్‌లు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణం పనులూ మంజూరు చేశారు. ఈ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి.

ఈ ఏడాది సిమ్మెంట్ రోడ్లు, కాలువల నిర్మాణ పనులు మంజూరుకు అవకాశం ఉందా?

జిల్లాలో ప్రభుత్వ ప్రాధాన్యతను అనుసరించి ప్రభుత్వశాఖలకు గ్రామాల్లో సొంత భవనాల నిర్మాణం తప్పని సరైంది. ప్రభుత్వ ప్రాధాన్యతగా వీటి నిర్మాణం జరుగుతోంది. సిమ్మెంటు రోడ్లతో పాటు కాలువల నిర్మాణం గతంలో చేపట్టారు. వాటి అవసరాల కంటే భవనాలకు ప్రస్తుత ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. మెటీరియల్ కాంపోనినెంట్ పనుల పర్యవేక్షణ బాధ్యతలను మండలాల్లో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్‌శాఖ పర్యవేక్షిస్తోంది. గ్రామాల్లో ఇంజినీరింగ్ సహాయకులు అందుబాటులో ఉండటం వల్ల భవన నిర్మాణ పనుల పర్యవేక్షణ సులభతరమైంది. పనుల గ్రౌండింగ్, ఎంబుక్ నమోదు వరకు వారే పర్యవేక్షిస్తారు. మెజర్‌మెంట్ నమోదు సమయంలో మండల ఇంజినీర్లు పర్యవేక్షించి బిల్లుల చెల్లింపునకు అప్‌లోడ్ చేస్తున్నారు. దీని వల్ల చెల్లింపులు సకాలంలో జరుగుతున్నాయి.

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులకు ఉపాధి నిధుల వినియోగం ఎలా ఉంది?

జిల్లా వ్యాప్తంగా జగనన్న కాలనీల్లో మౌలికవసతుల కల్పనకు కలెక్టరు ఆదేశాలను అనుసరించి పనులు గుర్తించడం జరిగింది. ఇప్పటికే కొన్ని చోట్ల పనులు చేపట్టడం జరుగుతోంది. సిమెంట్ రోడ్లతో పాటు, కాలువల నిర్మాణం, విద్యుద్దీకరణ, తాగునీరు అందించడం ద్వారా కాలనీల రూపు రేఖలే మారిపోతాయి. అందులో భాగంగా ఉపాధి హామీ నిధులతో రోడ్ల నిర్మాణం, కాల్వల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. మంజూరు చేసిన పనుల్లో కొంత వేగం పుంజుకుంటే వారి అవసరాలు తీరిపోతాయి. ఎంసిసిల పరిధిలో ఇప్పటికే ఎం బుక్కుల్లో రికార్డు చేసిన అన్ని మెటీరియల్ బిల్లులు అప్లోడ్ చేయాలని ఆదేశాలిచ్చాం .

జాబ్ కార్డులకు ఆధార్ అనుసంధాన ప్రక్రియ ఎంత మేరకు పూర్తి చేశారు?

జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో జాబ్‌కార్డులకు ఆధార్ అనుసంధాన ప్రక్రియ చేపట్టాలని ఆదేశించాం. కొన్ని మండలాల్లో ఇంతవరకు పూర్తికాకపోవడం వల్ల శతశాతం అనుసంధాన ప్రక్రియ సాధించడం కొంత జాప్యమవుతోంది.

అలరించిన తప్పెట గుళ్ల ప్రదర్శన

అలరించిన కళా జాతర

ప్రజాశక్తి - పలాస

మండలంలోని రంగోయి గ్రామంలో ఆదివారం గిడుగు రామ్మూర్తి తెలుగు భాష, జానపద కళాపీఠం, భద్రి అప్పన్న స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో నిర్వాహకులు భద్రి కూర్మారావు సారథ్యంలో కళాజాతర నిర్వహించారు. ముందుగా కళాకారులతో గ్రామ పురవీధుల్లో పర్యటిస్తూ మేళ, తాళాల మధ్య ఉత్సాహభరితంగా నృత్యాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. అనంతరం జరిగిన కళా జాతరలో జముకలు, ఏరుకుల పాటలు, గంగిరెద్దులు, చెక్క భజన, బుర్రకథ, గైరమ్మ, నందన్న పాటలతో రోజంతా ప్రదర్శన చేపట్టారు. తప్పెట గుళ్ళ, యువకులు జానపద గేయాలకు నృత్యాలు చేశారు. కళాకారులు తమ ప్రదర్శనలతో ప్రజలను మైమరిపించారు. ఈ సందర్భంగా భద్రి కూర్మారావు మాట్లాడుతూ అంతరించిపోతున్న కళలలను కాపాడేందుకే తాను 20ఏళ్లుగా ప్రతి ఏడాదీ సంక్రాంతి సమయంలో కళా జాతర నిర్వహిస్తున్నామని చెప్పారు. భావితరాలకు కళలలపై అవగాహన కలిగించేందుకే ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. తమ పూర్వీకుల నుంచి వస్తున్న సాంప్రదాయాలు, కట్టుబాట్లు జీవన విధానాలు కనుమరుగువుతున్న తరుణంలో కళాకారులను ఆదరించడమే కాకుండా వారి ప్రదర్శనలు ప్రజలకు తెలియ జేస్తున్నామన్నారు. గిడుగు రామ్మూర్తి ముని మనవరాలు లలిత శాస్త్రీయ గాయని స్నేహలత హాజరై జానపదాలు సినిమాల్లో పాడించి అవార్డులు అందుకుంటున్నారని చెప్పారు. ప్రముఖ సాహితీవేత్త సన్నశెట్టి రాజశేఖర్ మాట్లాడుతూ 20 వసంతాలు జానపద కళలకు నిలయంగా రంగోయి గ్రామం చరిత్రపుటల్లో ఉంటుందన్నారు. ఎపి జానపద కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కుమార్‌నాయక్ మాట్లాడుతూ జానపద కళలను పరిరక్షించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ఒడిశా, భిలాయ్, అండమాన్. తెలంగాణ ప్రాంతాల నుండి పలు కళారూపాలు ప్రదర్శన పలువురిని ఆకట్టుకున్నాయి.

పాస్‌పోర్టు పోయినది

శ్రీకాకుళం జిల్లా, ఇచ్ఛాపురం మండలం, బిర్లంగి తోటూరు గ్రామానికి చెందిన మంగి శ్యామసుందర్ S/o Late శ్రీరాములు మంగి యొక్క పాస్ పోర్టు నెంబర్ నంబర్ P 7901615 బిర్లంగి తోటూరు గ్రామం నుండి మున్సిపల్ పరిధి రత్తకన్నా గ్రామం మీదగా సైకిల్ పై వస్తుండగా మార్గమధ్యలో జారి పడిపోయింది. ఎవరికైనా దొరికిన యెడల మంగి శ్యామసుందర్‌కు గాని, ఇచ్ఛాపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో గాని అప్పగించండి.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్
9059512759

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం

ప్రజాశక్తి- పలాస

రక్త దానం చేయడం ద్వారా మరొకరి ప్రాణం కాపాడుతుందని, యువత రక్త దానం చేసేందుకు ముందుకు రావాలని కాశీబుగ్గ సిఐ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని అమరావతి ఫ్యామిలీ రెస్టారెంట్ అండ్ లాడ్జి ద్వితీయ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం పవనపుత్ర సేవా సంస్థ, కాశీబుగ్గ ప్రజాపత్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముందుగా సిఐ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చునన్నారు. రక్తదానం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. మరింత చురుకుగా ఉత్సాహంగా ఉంటారన్నారు. ప్రమాదాలు జరిగే సమయంలో రక్తం ఎక్కువగా అవసరం ఉంటుందని, అందుకు రక్త నిల్వలు పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రక్తదానంపై ప్రజలకు, యువతకు అవగాహన కల్పించాలన్నారు. రక్తదాన శిబిరంలో 32 మంది రక్తదానం చేశారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలాస గవర్నమెంట్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ చిన్నమనాయుడు, డాక్టర్ కోన మోహన్‌బాబు, డాక్టర్ కూన పవన్‌కుమార్, డాక్టర్ మెట్ట లక్ష్మీనారాయణ, డాక్టర్ సుధీర్, శ్రీకాకుళం జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి కొర్ల కన్నారావు, గురుదాసుపురం పంచాయతీ సర్పంచ్ ప్రతినిధి కుత్తుమ్ లక్ష్మణ్‌కుమార్, మాజీ సర్పంచ్ మార్పు వెంకటరావు, అమరావతి రెస్టారెంట్ అధినేతలు కుమార్‌యాదవ్, సుధా యాదవ్, ప్రతాప్ యాదవ్, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాలం, బిజెపి నాయకులు బమ్మిడి భగేష్, జగదీష్ పండా, సనపల అశోక్, సనపల కామేశ్వరరావు, ముడిమంచి వీరాస్వామి, ముడిమంచి నవీన్, ఎస్ మని, సంతోష్, శ్రీ పవనపుత్ర సేవా సంస్థ వ్యవస్థాపకులు మజ్జి భాస్కరరావు, అధ్యక్షులు కొల్లి పాల్గునరావు, తారకేశ్వరరావు, అప్పన్న పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న సిఐ శ్రీనివాసరావు

సాగు, తాగునీరు ఇప్పించాలి

ప్రజాశక్తి- బూర్జ

ఒనిగెడ్డ ద్వారా ఖరీఫ్ సమయంలో సాగునీరు ఇప్పించాలని రైతులు, ఇందింటికీ కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీరు ఇప్పించాలని మహిళలు శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం వద్ద వాపోయారు. మండలంలోని బూర్జ పంచాయతీ చిన్నకురింపేటలో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఖరీఫ్‌లో సమయానికి సాగునీరు అందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. ఏడాదిలో ఆరు నెలల పాటు ఒనిగెడ్డ ద్వారా నీరు అందించితే పుష్కలంగా పంటలు పండించుకుంటామని వాపోయారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ ఒనిగెడ్డ కాలువ గురించి ఇప్పటికే ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి సాగునీరు అందించేందుకు చర్యలు చేపడతామని హామీనిచ్చారు. కార్యక్రమంలో తహశీల్దార్ రమణారావు, ఎంపిడిఒ రవీంద్రబాబు, హౌసింగ్ వర్క్స్ ఇన్‌స్పెక్టర్ ఎం.రాంప్రసాద్, ఎంపిపి ప్రతినిధి కర్నెన నాగేశ్వరరావు, జెడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావు, ఆవుట్ సోర్సింగ్ రాష్ట్ర డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, వైస్ ఎంపిపిలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణంనాయుడు, డిసిఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాంనాయుడు, సర్పంచ్ ఏగు అనూరాధ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

చిత్రపటాన్ని అందజేస్తున్న ఇఒ హరిసూర్యప్రకాష్

అరసవల్లికి వివిపిల తాకిడి

ప్రజాశక్తి – శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయానికి ఆదివారం వివిపిల తాకిడి పెరిగింది. విజయనగరం సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వైస్ ఛాన్సలర్ టి.వి.కట్టిమణి, కాకినాడకు చెందిన శాసన మండలి సభ్యులు అనంత్‌బాబు, శ్రీకాకుళం ఎస్‌బిఐ అదనపు ఎస్‌పి మణికంఠ, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన మండా వీర వెంకట సత్యనారాయణరెడ్డిలు కుటుంబ సభ్యులతో కలిసి అరసవల్లిని దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతించారు. ఆలయంలో స్వామివారి సేవ అనంతరం వారికి స్వామివారి శేష వస్త్రాలను కప్పి ఆశీర్వదించి అందజేశారు. అనంతరం ఇఒ వి.హరిసూర్యప్రకాష్‌ను కలుసుకున్న మండా వీర వెంకట సత్యనారాయణరెడ్డి ఆలయంలో రంగుల కోసం రూ.50 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ బి.ఎస్.చక్రవర్తి, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

రూ.2.34 లక్షల ఆదాయం

అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయానికి ఆదివారం రూ.2.34 లక్షల ఆదాయం సమకూరినట్టు ఇఒ తెలిపారు. టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.18,600, విరాళాల రూపంలో రూ.1,25,893, ప్రసాదాల రూపంలో రూ.90 వేలు ఆదాయం సమకూరినట్టు తెలిపారు.

విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రాజకీయ దురంధరుడు శ్రీరాములునాయుడు

ప్రజాశక్తి- రణస్థలం

జిల్లా రాజకీయ దురంధరుడు, మాజీ మంత్రి గొర్లె శ్రీరాములు నాయుడు అని ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. శ్రీరాములునాయుడు 18వ వర్థంతి సందర్భంగా మండల కేంద్రంలో ఆయన విగ్రహానికి ఆదివారం పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కీర్తిప్రతిష్టలను రాష్ట్రం మొత్తం చాటి చెప్పిన వ్యక్తిగా శ్రీరాములునాయుడు నిలుస్తారని అన్నారు. రాజకీయాల్లో ఎంతో మందికి మార్గదర్శకులుగా నిలిచారని గుర్తు చేసుకున్నారు. అనంతరం పేదలకు దుప్పట్లను, దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, కరిమి రామకోటీనాయుడు, గొర్లె అప్పలనాయుడు, గొర్లె రాధాకృష్ణ, వైసిపి మండల అధ్యక్షులు మహంతి పెద్దరామునాయుడు, జె.ఆర్.పురం సర్పంచ్ బవిరి రమణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో నియంత పాలన

ప్రజాశక్తి- పలాస

రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలన అధ్వాన్నంగా ఉందని, ప్రభుత్వ శాఖలను గుప్పిట్లో పెట్టుకొని నియంతగా పాలన సాగిస్తున్నారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ పరిధిలో 26, 27వ వార్డుల్లో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి ఆదివారం నిర్వహించారు. వార్డుల్లో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను, అసమర్థతను ప్రజలకు వివరిస్తూ వారి సమస్యలను లిఖితపూర్వకంగా నమోదు చేశారు. ఆయన మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచడంతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సామాన్య ప్రజలకు ఏదో మంచి చేస్తారని రాష్ట్రమంతట ఓట్లు వేసి వైసిపిని గెలిపిస్తే బస్సు, కరెంటు ఛార్జీలు పెంచడమే కాకుండా చివరకు చెత్తపై కూడా పన్ను వేసే పరిస్థితి తీసుకొచ్చారని దుయ్యబట్టారు. వైసిపి పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. రానున్న 2024 ఎన్నికల్లో చంద్రబాబుని ముఖ్యమంత్రి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర బిసిసెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, కౌన్సిలర్లు గురిటి సూర్యనారాయణ, డిక్కల ఆనంద్, బద్ద నాగరాజు, గాలి కృష్ణారావు, మాజీ ఎంపిపి చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, గొళ్ల చంద్రరావు, ఎంకాల రవికుమార్‌గుప్తా, డొక్కర శంకర్, జోగ మల్లేశ్వరరావు, సవర రాంబాబు, అంబటి కృష్ణమూర్తి, కొమ్మారు సురేష్, కమ్మరి ఆత్మారావు, బెవల సంతోష్, కొరికాన శంకర్, నావిల్లి శ్రీను, కొత్త సత్యం, గిన్ని సింహాచలం, చెల్లూరు రామకృష్ణ, కొండల ధనేశ్వరరావు, ఉప్పాడ పాండురంగారావు, మహ్మద్ గౌస్, రట్టి మనోజ్, కార్యకర్తలు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పలాస : ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

కవిటి : ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

బైరిపురంలో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి

కవిటి: మండలంలోని బైరిపురం గ్రామంలో టిడిపి శ్రేణులు ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించాయి. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి పెరుగుతున్న ధరలు, తరుగుతున్న ఆదాయం, తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మణి చంద్రప్రకాష్, సీపాన వెంకటరమణ, పుల్లట సంతోష్, పుల్లట రాజు, కొర్రాయి వాసుదేవ్, బాసుదేవ్ ప్రధాన్, బాసుదేవ్ రౌలో, కె.వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

కళింగులు ఏకం కావాలి

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- పలాస

జిల్లాలో కళింగులకు ప్రాధాన్యత లభించాలంటే అందరూ ఏకం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని చినబడం ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు అధ్యక్షతన నియోజకవర్గ పరిధిలో కళింగ వనభోజన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముందుగా మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అత్యధికంగా కళింగులు ఉన్న జిల్లా శ్రీకాకుళం అని అన్నారు. అలాగే మార్పు పద్మనాభం, వీర గున్నమ్మ విగ్రహాలు ఏర్పాటుకు ఎవరు అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదన్నారు. కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి మాట్లాడుతూ కళింగులకు రాజకీయాల్లో చురుకుగా పాల్గొవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ పిరియా విజయ, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాలం అశోక్, టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్, మాజీ ఎంపి డాక్టర్ కణితి విశ్వనాథం, మాజీ ఎమ్మెల్యేలు కె.భారతి, బొడ్డేపల్లి సత్యవతి, దువ్వాడ శ్రీకాంత్, దువ్వాడ హేంబాబు చౌదరి, చాపర వేణుగోపాల్, వజ్జ బాబూరావు, చాపర సుందర్‌లాల్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

పుస్తక నిక్షిప్త కేంద్రం ప్రారంభం

ప్రారంభిస్తున్న సువర్ణ

ప్రజాశక్తి – బూర్జ

పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సువ్వారి సువర్ణ అన్నారు. మండలంలోని వైకుంఠపురం గ్రంథాలయంలో పుస్తక నిక్షిప్త కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు, యువత, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాఠశాల విద్యార్థులు సృజనాత్మకతను పెంచుకునేలా ఉపాధ్యాయులు, తల్లి దండ్రులు విద్యార్థులను ప్రోత్సహించాలని కోరారు. ప్రతి విద్యార్థికీ పుస్తక పఠనం అవసరమని అన్నారు. పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. వివిధ రకాల పుస్తకాలు చదవడంతో లోకజ్ఞానం వస్తుందన్నారు. జిల్లాలో అన్ని గ్రామాల్లో ప్రజలకు గ్రంథాలయాలు అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. సువ్వారి సత్యనారాయణ, గ్రంథాలయాధికారి ఎ.కోటేశ్వరరావు, రాపాక ఎంపిటిసి పోతురాజు సూర్యారావు, మన్మథ, జగన్ పాల్గొన్నారు.

కంచిలి : విగ్రహానికి పూలమాలలు వేస్తున్న విక్టర్ ప్రసాద్

అంబేద్కర్ విగ్రహాల ఆవిష్కరణ

ప్రజాశక్తి – కంచిలి

దళిత వర్గాల అభ్యున్నతికి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చేసిన కృషి ఎనలేనిదని ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ ఎం.విక్టర్ ప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని జ్యోతి అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పూర్వ విద్యార్థుల సంఘం నూతనంగా నిర్మించిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. అలాగే కళావేదిక ప్రాంగణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేద్కర్ ఒక తరానికి చెందిన వ్యక్తి కాదన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కె.కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ రమణ, సాంఘిక సంక్షేమ అధికారి గ్రేసీ, దళిత సంఘం నాయకులు, పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

బలదలో...

కొత్తూరు : మండలంలోని బలదలో అంబేద్కర్ విగ్రహాన్ని పాతపట్నం నియోజకవర్గం బిఎస్‌పి నాయకులు బొడ్డేపల్లి కృష్ణారావు ఆవిష్కరించారు. అంబేద్కర్ ఆదుజాడల్లో నడవాలని సూచించారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, దళిత నాయకులు కె.రాంగోపాల్, బిడ్డిక మోహనరావు, లాన్ సోమేశ్వరరావు, బి.బుద్ధుడు, చుక్క రాంబాబు, బి.రామకృష్ణ, ధర్మారావు, ఎస్.మన్మథరావు, కె.విజయకుమార్‌లు పాల్గొన్నారు.

క్రీడా దుస్తులతో విద్యార్థులు

క్రీడా దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి – పొందూరు

మండలంలోని పిల్లలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైన నిరుపేద వర్గమాన క్రీడాకార విద్యార్థులకు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు గురుగుబెల్లి రాజశేఖర్ వితరణ చేశారు. ఈయన తన కుమారుడు ధీరజ్ కుమార్ జ్ఞాపకార్థం సుమారు రూ.40 వేలు విలువ గల క్రీడా దుస్తులు, బూట్లు, బాల్స్ వంటివి పంపిణీ చేశారు. వీటిని ప్రధానోపాధ్యాయులు సుగ్గు కనుబలరావు విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో పిఎంసి కమిటీ చైర్మన్ గురుగుబెల్లి వరాహనరసింహం, ఉపాధ్యాయులు సత్యనారాయణ, వాసుదేవరావు, జగదాంబ, రమణ, కృష్ణ, రోజారమణి, శారద పాల్గొన్నారు.

చిన్నారావు మృతదేహం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కోటబొమ్మాళి: మండలంలోని జాతీయరహదారి చీపుర్లపాడు వద్ద ఆదివారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో సంతబొమ్మాళి మండలం కాపుగోదాయవలస గ్రామానికి చెందిన నెయ్యిల చిన్నారావు(56) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. చిన్నారావు తన గ్రామం నుంచి శ్రీపురం కూరగాయల మార్కెట్‌కు కూరగాయలు కొనేందుకు వెళ్లాడు. రోడ్డు దాటుతుండగా నరసన్నపేట నుంచి టెక్కలి వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో చిన్నారావుకు తీవ్ర గాయాలై, అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య కుమారి, కుమారుడు సంతోష్, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని స్థానిక సిహెచ్‌సికి పోస్టుమార్టంకు తరలించారు. హెచ్‌సి వై.లక్ష్మణరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయంలో చోరీ

ప్రజాశక్తి – పలాస

మండ కేంద్రంలోని సీతమ్మ తల్లి ఆలయంలో ఆదివారం ఉదయం చోరీ జరిగింది. ఆలయ తలుపులకు వేసిన తాళాలు బద్దలుకొట్టి గుడి ఆవరణలోని ఉన్న హుండీలోని చిల్లర డబ్బులను దొంగలించారు. ఆలయ పూజారి ప్రతి రోజులాగే ఈ రోజు కూడా ఆలయం తెరిచేందుకు రాగా ఆలయ తలుపులు బద్దలు కొట్టి ఆవరణలో ఉన్న హుండీ పగల కొట్టినట్లు గుర్తించారు. స్థానికులతో కలిసి పోలీసులకు సమాచారం చేరవేశారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి హుండీలో డబ్బులను తీయడం జరుగుతుందని, ఇటీవల డబ్బులు తీయడం జరిగిందని, అయితే కేవలం రెండు మూడు వేలు మాత్రమే హుండీలో ఉంటుందని కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఆలయంలో అమ్మవారి విగ్రహాలు, ఆభరణాలు ఉన్నాయని చెప్పారు.

దగ్ధమవుతున్న గడ్డివాములు

గడ్డివాములు దగ్ధం

ప్రజాశక్తి – జలుమూరు

మండలంలోని పాగోడు పంచాయతీ పరిధి వెలుపోడ వద్ద ఆదివారం సంభవించిన అగ్నిప్రమాదంలో ఏడు ఎకరాల వరి గడ్డి వాములు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో గ్రామంలోని గొల్లంగి రమణకు చెందిన రెండు, గొల్లంగి భూలోకుడుకు చెందిన ఐదు ఎకరాలకు చెందిన గడ్డి వాములు అగ్నికి ఆహుతయ్యాయని బాధితులు వాపోతున్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. సమాచారం అందుకున్న కోటబొమ్మాళి అగ్నిమాపక సిబ్బంది శకటంతో ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. సమాచారం తెలుసుకున్న పాగోడు సర్పంచ్ దామ మన్మథరావు, ఎంపిటిసి రావాడ చందనబాబు బాధితులను పరామర్శించారు.

బారులు తీరిన వాహనాలు

అన్నదాతకు కష్టాలు

పలాస: రైతన్నలు పండించిన ధాన్యాన్ని విక్రయించే దుకు ఇబ్బందులు తప్పడం లేదు. మిల్లు వద్ద ధాన్యం బస్తాల లోడుగల వాహనాలతో పడిగాపులు కాస్తున్నారు. మిల్లర్ ఇష్టారాజ్యం, అధికారుల అనాలోచిత నిర్ణయాల వల్ల పండిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు చివరి నిమిషంలో వేలకు వేలు పెట్టుబడులు పెట్టి ఇచ్చాపురం, సోంపేట, కంచిలి, మందస, కవిటి, వజ్రపుకొత్తూరు, నందిగాం, టెక్కలి నుంచి రైతులు ధాన్యాన్ని పలాస మిల్లులకు తీసుకు రావడంతో రైస్ మిల్లు ముందు వాహనాలు బారులుతీరాయి.

ప్రతి నెలా 1న పెన్షన్ చెల్లించాలి

రణస్థలం: ప్రతినెలా 1న విశ్రాంతి ఉద్యోగులకు పెన్షన్ చెల్లించాలని రణస్థలం, లావేరు మండలాల పెన్షనర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పున్నాన సరసింహులు నాయుడు, ఎడ్ల పాపినాయుడు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈనెల 8వ తేదీ వచ్చినా నేటికీ ప్రభుత్వం పెన్షన్లు చెల్లించకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 9న తహశీల్దార్, ఎస్‌టిఒ కార్యాలయాల్లోని అధికారులకు వినతిపత్రాలు అందజేస్తున్నామని అన్నారు. నెలసరి ఖర్చుల కోసం ఎదురుచూస్తున్నామని అన్నారు. పెరుగుతున్న ధరలు, వైద్య ఖర్చులు, ఇతర ఆర్థిక బాధ్యతలు వల్ల విశ్రాంతి ఉద్యోగులు ఆర్థిక సమస్యలు ఆదికమవుతున్నాయని పేర్కొన్నారు. జిఐఎయులుగా ఉన్న 9 విడతల కరువు భత్యం వెంటనే విడుదల చేయాలని కోరారు.

శంకర్ పరామర్శ

శ్రీకాకుళం అర్బన్ : నియోజకవర్గంలో జరిగిన వివిధ కారణాలతో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ ఆదివారం పరామర్శించారు. శ్రీకాకుళం రూరల్ మండలం కణుకడం చెందిన టిడిపి కార్యకర్త రమణ తల్లి కామమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆయన టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషతో కలిసి పరామర్శించారు. నగరంలోని ఇటీవల గుండె పోటుతో మృతి చెందిన టిడిపి మైనార్టీ విభాగం అధ్యక్షులు షారూఖ్ కుటుంబాన్ని ఇదిరా విజ్ఞాన్ భవన్‌లో కలుసుకుని పరామర్శించారు. అక్కడ నిర్వహించిన సంస్మరణ సభలో పాల్గొని సాత్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఆయన తో పాటు గార మండల టిడిపి ప్రధాన కార్యదర్శి బడగల వెంకటప్పారావు, కరజాడ మాజీ సర్పంచ్ బలగ చిన్నవాడు, గొండు సింహాచలం, సింగుపురం ఎంపిటిసి పంగ సత్యనారాయణ, ఎంపిటిసి మాజీ సభ్యులు ఎండు అప్పన్నదొర ఉన్నారు.

పరామర్శిస్తున్న శంకర్, శిరీష

బీజామృతంతో అధిక దిగుబడులు

సారికందను నాటిన పొలం

సంతబొమ్మాళి : బీజామృతంతో సారికందలో అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం ఎపిడిఎ పి.సింహాచలం అన్నారు. మండలంలోని కాపుగోదయ్యవలసలోని సారికంద వేసే రైతులకు ఆదివారం పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సారికంద పిలకలను బీజామృతంతో శుద్ధి చేసి నాటుకోవడం ద్వారా దుంప కుళ్లు తెగుళ్లను, శిలీంద్రాల వల్ల బ్యాక్టీరియా వచ్చే తెగుళ్ల నుంచి నెల రోజుల వరకు కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. వంద కేజీల విత్తనాలను బీజామృతంతో శుద్ధి చేయడానికి 20 లీటర్ల నీరు, ఐదు కేజీల దేశీ ఆవు పేడ, ఐదు లీటర్ల దేశీ ఆవు మూత్రం, 50 గ్రాముల తినే సున్నం (కిల్లీ సున్నం), కొద్దిగా పుట్టమట్టి కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

తప్పుడు ప్రచారం తగదు

చిన్నారావు, సర్పంచ్

కోటబొమ్మాళి: అగ్రకులాలు చెప్పినట్లు వినడం లేదని, మారు చెప్పిన పనులు చేయనందుకు నాపై తప్పుడు ప్రచారం చేయడం తగదని కురుడు పంచాయతీ సర్పంచ్ కోతి చిన్నారావు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దళితుడిని, ఆటో డ్రైవరుగా ఉన్న తనను ప్రజలు ఎంతో నమ్మకంతో నన్ను గెలిపించారని అన్నారు. వారి నమ్మకానికి నిరంతరం కృషి చేస్తానని చెప్పారు. అంతేగానీ కొంతమంది ప్రయోజనం కోసం తనను పని చేయనివ్వడం భావ్యం కాదని అన్నారు. తనపై తప్పుడు ప్రచారం మానుకొని, పంచాయతీ అభివృద్ధిలో తనకు సహకరించాలని కోరారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మాట్లాడుతున్న వైసిపి నాయకులు

కొత్తూరు: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వైసిపి మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, ఎంపిపి ప్రతినిధి గొగుల వర్షప్రసాద రావు, పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని ఆదివారం విలేకరులతో మాట్లాడారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత దశల వారీగా పెంచుతూ రూ.2,750కు పెంచిన ఘనత సిఎం జగన్మోహన్‌రెడ్డిదేనని అన్నారు. మండలంలోని 279 మందికి నూతనంగా పింఛన్లు అందజేశామన్నారు. విపక్షాలు పింఛన్లు తగ్గిస్తున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పూర్తిస్థాయిలో పార్టీ కోసం పనిచేసే వారిని కన్వీనర్లుగా నియమించాలని అన్నారు. సమావేశంలో సర్పంచ్ పడాల కృష్ణవేణి, ఎంపిటిసి లక్ష్మీనారాయణ, వైసిపి నాయకులు ఎల్.తిరుపతిరావు, జి.ఆనందరావు, పి.శశికుమార్, పంకజాదాస్, బి.రామకృష్ణ పాల్గొన్నారు.

పండగ వేళ అప్రమత్తత అవసరం

అవగాహన కల్పిస్తున్న డిఎస్‌పి శివరామిరెడ్డి

పలాస: సంక్రాంతి పండగ సమయంలో వ్యాపారస్తులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, దొంగతనాలు, దోపిడీలు జరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కాశీబుగ్గ డిఎస్‌పి శివరామిరెడ్డి అన్నారు. కాశీబుగ్గ మూడు రోడ్ల జంక్షన్ వద్ద ఆదివారం సాయంత్రం దొంగతనాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా పండగ సమయంలో ఇతర గ్రామాలు వెళ్లేటప్పుడు తమతో పాటు ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలను తీసుకువెళ్లాలన్నారు. లేకుంటే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందిస్తే ప్రత్యేక పోలీస్ బలగాలను ఏర్పాటు చేసి గృహాల వద్ద పెట్రోలింగ్ జరుగుతుందన్నారు. వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, మాయమాటలు చెప్పి మెడలో ఆభరణాలు, విలువైన వస్తువులు దోచుకునేందుకు అవకాశం ఉంటుందని ఈ విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. ఎవరు మాయ మాటలు చెప్పినా నమ్మవద్దని హితవు పలికారు. పండగ సమయంలో అపరిచితులు ఎవరైనా ఊరిలోకి వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసుల దృష్టికి తీసుకురావాలని, అవసరమైతే ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కాశీబుగ్గ సిఐ శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యువశక్తి పోస్టర్ ఆవిష్కరణ

సందిగాం: ఈ నెల 12న తాళ్లవలసలో నిర్వహించే యువశక్తి బహిరంగ సభ వాల్‌పోస్టర్‌ను మండల కేంద్రంలో జనసేన నాయకులు ఆదివారం ఆవిష్కరించారు. సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు సాలన షణ్ముఖరావు, పసుపురెడ్డి సోమేశ్వరరావు, మల్లా బాలకృష్ణ, వాకాడ కృష్ణ, జన సైనికులు గోపి, లక్ష్మణరావు, రాజు, జయప్రకాష్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: యువశక్తి బహిరంగసభను విజయవంతం చేయాలని జనసేన రాష్ట్ర కార్యదర్శి పైక్ నాయుడు కమల్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉన్నత చదువులు చదివి, ఉద్యోగాలకు ఎదురు చూస్తున్న యువత భవిష్యత్‌ను వైసిపి అంధకారంలోకి నెట్టిందన్నారు. సంక్షేమ పథకాల పేరుతో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని విమర్శించారు. జనసేన పార్టీ ఇచ్ఛాపురం నియోజకవర్గ అధ్యక్షులు దాసరి రాజు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో నెలకొన్న వలసలు, తదితర సమస్యలను పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి, యువత తమ గళాన్ని వినిపించేందుకు ఇదొక చక్కటి వేదిక అని అన్నారు. సమావేశంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: యువశక్తి బహిరంగసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ ఉత్తరాంధ్ర కన్వీనర్ కిరణ్ రాయల్ కోరారు. ఆదివారం మెళియాపుట్టిలో సభను జయప్రదం చేయాలని కోరారు. పోస్టర్ ఆవిష్కరిస్తూ జనసేన పార్టీ పోస్టలను అందించారు. కార్యక్రమంలో గేదెల చైతన్య, దుక్క బాలరాజు, పిట్ట హరికృష్ణ, ఎస్.వంశీ, పి.మణికంఠ, లోకేష్ పాల్గొన్నారు.



సందిగాం : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జనసేన నాయకులు

ఇచ్ఛాపురం: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జనసేన నాయకులు

పుస్తకాలను చదువుతున్న చిన్నారులు

గ్రంథాలయాల్లో పుస్తక ప్రదర్శన

లావేరు : మండలంలోని మురపాక శాఖా గ్రంథాలయంలో ఆదివారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో బాలసాహిత్యం, జాతీయ నాయకుల జీవిత చరిత్రలు, చిన్నపిల్లల పుస్తకాలను విద్యార్థులు చదివారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి నెలా మొదటి ఆదివారం పుస్తక ప్రదర్శన నిర్వహిస్తామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు జి.షణ్ముఖరావు పాఠకులు విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే లావేరు శాఖాగ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డెయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహశీల్దార్ సరోజని

ఆధార్ నమోదు తప్పనిసరి

మెళియాపుట్టి: ప్రతి ఒక్క ఓటరు తమ ఓటరు కార్డుకు ఆధార్ నమోదు చేసుకోవాలని తహశీల్దార్ పి.సరోజని కోరారు. ఆదివారం పెద్ద పద్మపురం, వసుంధర, సుందరాడ, నడసంద్ర గ్రామాల్లో ఓటరు నమోదు కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బిఎల్ఒలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆమెతో పాటు బిఎల్ఒలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

సోషల్ రెస్పాన్సబులిటీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యాన బుడ్డెపు త్రినాథ్, ఊట్ల రాజా సహకారంతో ఆదివారం స్థానిక ప్రభుత్వ బాలుర వసతి గృహ విద్యార్థులకు ఎస్ఐ గోవిందరావు దుస్తులు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నతస్థితికి చేరుకోవాలన్నారు. సమాజానికి తమవంతు సహకారం అందించాలని కోరారు. అనంతరం వసతిగృహ విద్యార్థుల యోగ, క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో దాత త్రినాథ్, హాస్టల్ సిబ్బంది, సోషల్ రెస్పాన్సిబులిటీ ఆర్గనైజేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సామాజిక భవన నిర్మాణమే లక్ష్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

తూర్పు కాపు సామాజిక తరగతి అభివృద్ధే ప్రధాన ఎజెండాగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆ తగరతి ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. నగరంలోని ఓ ప్రయివేట్ హోటల్‌లో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సంఘం అభివృద్ధికి, సామాజిక భవనం నిర్మాణం శరవేగంగా అభివృద్ధి చేయాలని పలు సూచనలు చేశారు. జిల్లా కేంద్రంలో సామాజిక తరగతి అవసరాల కోసం భవన నిర్మాణం చేపట్టడం ద్వారా ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. ముందుగా మాజీ మంత్రి గొర్లె శ్రీరాములునాయుడు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల, పాతపట్నం ఎమ్మెల్యేలు గొర్లె కిరణ్ కుమార్, రెడ్డి శాంతి, ఎమ్మెల్సీలు పాలవలస విక్రాంత్, పాకలపాటి రఘువర్మ, మాజీ ఎమ్మెల్యే ఎం.నీలకంఠంనాయుడు, జిల్లా సహకార బ్యాంకు చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, మాజీ చైర్మన్ డోల జగన్మోహన్, శాసపు జోగినాయుడు, సామాజిక వేత్త, పాతపట్నం టిడిపి నాయకులు మామిడి గోవిందరావు, తూర్పుకాపు సంఘం ప్రతినిధులు సురంగి మోహనరావు పాల్గొన్నారు. అనంతరం పల్సస్ సిఇఒ గేదెల శ్రీనుబాబు సామాజిక భవన్ నిర్మాణానికి రూ.కోటి విరాళాన్ని ప్రకటించారు.

ప్రణాళికతో చదివితే ఉజ్వల భవిష్యత్

ప్రజాశక్తి- పలాస

మాట్లాడుతున్న డాక్టర్ మోహన్‌బాబు

విద్యార్థులు ప్రణాళికతో చదివినప్పుడే ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని, అందుకు అనుగుణంగా విద్యార్థులు మెలగాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ కోన మోహన్‌బాబు అన్నారు. కాశీబుగ్గ విద్యా వాహిని డిగ్రీ కళాశాలలో ఆదివారం ఫెస్ట్ సెలబ్రేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలంటే ఇంటర్మీడియట్, డిగ్రీ కీలకమని, దీన్ని విద్యార్థులు గుర్తించుకోవాలన్నారు. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా భవిష్యత్‌లో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పైల తిరుమలరావు, ఎ.గిరిబాబు, బుద్ధిరెడ్డి గణపతి, పి.మన్మథరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

వంశధార వంతెన పరిశీలన

బాలునాయక్‌తో మాట్లాడుతున్న సూర్యప్రకాష్

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలోని దుప్పలపాడు పంచాయతీలో గ్రానైట్ పరిశ్రమలకు నిత్యం పెద్ద వాహనాల రాకపోకలతో వంశధార వంతెనతో పాటు బిటి రోడ్డు శిథిలావస్థకు చేరుకుందని, వాటిని నిర్మించాలని సర్పంచ్ గురువెల్లి సూర్యప్రకాష్ అన్నారు. ఆదివారం స్టేట్ చీఫ్ ఇంజినీరింగ్ సెక్రరేటరీ బాలునాయక్ దుప్పలపాడు వద్ద ఉన్న వంశధార బ్రిడ్జిని పరిశీలించారు. బ్రిడ్జి పరిస్థితిని చూసి నిర్మాణానికి అవసరమైనటువంటి పనులు చేయాల్సిందిగా అధికారులకు ఆదేశించారని సూర్యప్రకాష్ తెలిపారు.

అవగాహన కల్పిస్తున్న సిఐ వేణుగోపాలరావు

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి- కొత్తూరు

మండల కేంద్రం కొత్తూరులో సిఐ ఆర్.వేణుగోపాలరావు ఆద్వర్యాన ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు లేని, ముగ్గురేసి వెళ్తున్న, హెల్మెట్లు ధరించని, మద్యం తాగి వాహనం నడుపుతున్న వారి నుంచి అపరాధ రుసుం వసూళ్లు చేశారు. అనంతరం మాట్లాడుతూ సంక్రాంతి పండగ వేళ స్వగ్రామాలకు, బంధువుల ఇళ్లకు వెళ్తే విలువైన వస్తువులు భద్రపర్చుకోవాలని సూచించారు. ఇరుగు, పొరుగు వారికి తెలియజేయాలన్నారు. దీంతో చోరీలు అరికట్టవచ్చునని పేర్కొన్నారు. అలాగే ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఒంటరిగా మహిళలు వెళ్లకుండా గుంపుగా వెళ్లాలని సూచించారు. లేదంటే చైన్ దొంగల బారిన పడి విలువైన వస్తువులు చోరీకి గురవుతాయని అన్నారు.

నిరుపేదకు ఆర్థికసాయం

కవిటి: మండలంలోని బొరివంక గ్రామానికి చెందిన నిరుపేదకు గ్రామానికి చెందిన జనసైనికులు అండగా నిలిచారు. అనారోగ్యంతో బాధపడుతున్న గ్రామానికి చెందిన బైరి కుర్మమ్మ వైద్యానికి తమవంతు సాయంగా ఆదివారం రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఆశయానికి అనుగుణంగా ఈ చిరు సాయం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాళీ ప్రసన్న, విజయ్, నరసింహ, రాఘవేందర్, కళ్యాణ్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గం ఎన్నిక

ఇచ్ఛాపురం: శ్రీ స్వేచ్ఛావతి ఎలక్ట్రానిక్ మీడియా యూనియన్ నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. నూతన అధ్యక్షులుగా సాలీనా గణేష్, కార్యదర్శిగా వైకుంఠరావును ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గ సభ్యులు